సాక్షి ప్రకాశం
మంగళవారం । 3 । డిసెంబర్ । 2024





## సాయుధ దళాల నిధికి విరాళాలివ్వండి

సాయుధ దళాల నిధికి విరాళాలివ్వాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. - 8లో..



## శ్రీశైలం ఘాట్ రోడ్డులో ప్రమాదం

ఎదురుగా వస్తున్న ఆర్టీసీ, టెంపో ట్రావెల్స్ బస్సులు ఒకదానికొకటి ఢీకొన్న ఘటన శ్రీశైలం ఘాట్ రోడ్డులో చింతల సమీపంలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
28/24

## వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు. చలిగాలులు వీస్తాయి.

## న్యూస్‌రీల్

### 13 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

చీమకుర్తి: సీపీఎం 14వ జిల్లా మహాసభలు ఈనెల 13, 14, 15 తేదీల్లో చీమకుర్తిలో నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్‌కే మాబు తెలిపారు. చీమకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లా మహాసభలు చీమకుర్తిలోని బూచేపల్లి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా, మండల నాయకులు పమిడి వెంకట్రావు, పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, స్థానికులు పాల్గొన్నారు.

### వెలుగొండ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వాలి

- సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

మార్కాపురం: పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం కార్యదర్శి గాలి వెంకటరామిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వాసితులతో కలిసి సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ముంపునకు గురవుతున్న గొట్టిపడియ, అక్కచెరువు, సుంకేసుల, కలనూతల, చింతలముడిపి, గుండంచర్ల, కాటంరాజుతాండ, లక్ష్మీపురం, సాయిరాంనగర్, కృష్ణానగర్, పొట్టిసుబ్బయ్యపల్లి గ్రామాల్లో సుమారు 4617 మంది నిర్వాసితులకు సంబంధించి 8,329.55 ఎకరాల భూమి మునిగిపోతుందని అన్నారు. 2013 చట్టప్రకారం ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. వెంటనే ఆర్‌ఆర్ ప్యాకేజీని అమలుచేస్తూ నిర్వాసిత గ్రామాల్లో అన్నీ సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు.

### మల్టీ ఫంక్షనల్ ఎడ్యుకేషన్ సెంటర్ డార్మిటరీలు ప్రారంభం



ఎడ్యుకేషన్ సెంటర్ డార్మిటరీలను ప్రారంభిస్తున్న స్పెయిన్ దాతలు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల మండల చిన్న గుడిపాడులోని ఆర్డీటీ కార్యాలయంలో మల్టీ ఫంక్షనల్ ఎడ్యుకేషన్ సెంటర్ డార్మిటరీల ఏర్పాటుకు స్పెయిన్ దేశస్తులు విరాళాలిచ్చారు. ఆ నిర్మాణాలు పూర్తి కావడంతో వాటిని దాతల బృందం సోమవారం ప్రారంభించింది. ఆర్డీటీ కార్యాలయానికి చేరుకున్న స్పెయిన్ దాతలకు మానసిక దివ్యాంగ చిన్నారులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్పెయిన్ దేశస్తులు మాట్లాడుతూ నిరుపేద చిన్నారులు బుద్ధిమాంద్యంతో తల్లిదండ్రులకు భారం కాకూడదన్నారు. కనీసం తమ వ్యక్తిగత పనులు చేసుకునేందుకు ఆయా చిన్నారులను సిద్ధం చేయాలనే సంకల్పంలోనే మల్టీ ఫంక్షనల్ ఎడ్యుకేషన్ సెంటర్, డార్మిటరీల నిర్మాణాలకు ఆర్థికసాయం అందించామన్నారు. ఈ సందర్భంగా మానసిక దివ్యాంగ చిన్నారుల ప్రదర్శనలు స్పెయిన్ దేశస్తులను ఆకట్టుకున్నాయి. దాతలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో జీబీఆర్ డైరక్టర్ రఫీక్, ఏడీ.యుగంధర్, రీజినల్ డైరక్టర్ నాగరాజు, రీజినల్ ఇంజినీర్ గోపాల్, ఏటీఎల్ వేమయ్య, మేనేజర్ సత్యన్న పాల్గొన్నారు.

### 4న హిందూ సంఘాల ఐక్య వేదిక ర్యాలీ

ఒంగోలు మెట్రో: బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ హిందువులను రక్షించడానికి తక్షణమే భారత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ ఉదయం పది గంటలకు ఒంగోలులో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఐక్య వేదిక ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయం అయోధ్య భవనంలో విశ్వహిందూ పరిషత్ ప్రాంత సత్సంగ ప్రముఖ్ సోమ సుబ్బారావు అధ్యక్షతన ఐక్య వేదిక సమావేశం నిర్వహించారు. సోమ సుబ్బారావు, తడికమళ్ళ హరిప్రసాద్, త్రిపుర భైరవేశ్వరానంద స్వామి, రావినూతల రామ్ ప్రసాద్, మక్కపాటి వెంకటేశ్వర్లు, ఈమని బలరామ్, దగ్గుమాటి వెంకారెడ్డి పాల్గొని నిరసన ర్యాలీ నిర్వహణపై చర్చించారు. బుధవారం ఉదయం పది గంటలకు స్థానిక కేశవ స్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం నుంచి పొట్టి శ్రీరాములు విగ్రహం మీదుగా ఏనుగు చెట్టు వీధి, ట్రంకు రోడ్డు మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహిస్తారని, అనంతరం బంగ్లాదేశ్ లోని హిందువుల పై జరుగుతున్న దాడులను అరికట్టేలా భారత ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పిస్తారని చెప్పారు. నిరసన ర్యాలీలో హిందూ బంధువులంతా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.






## కార్తీక వెలుగులు.. భక్తి కాంతులు

కార్తీక మాసం నెల రోజుల పాటు కార్తీక దీపాలు వెలిగించిన మహిళలు చివరి అమావాస్య ముగిసిన తరువాత వచ్చే పోలిపాడ్యమి రోజు అయిన సోమవారం భక్తితో నమస్కరించి అరటి దొప్పలలో దీపాలు వెలిగించి సమీపంలోని సముద్ర తీరాలు, చెరువుల్లో వదిలారు. ఆడంబరాల కన్నా భక్తితో సంప్రదాయాలను ఆచరించాలని తెలిపే పోలి బొందితో స్వర్గాన్ని చేరిన కథని స్మరించుకున్నారు. కార్తీక మాసంలో ఏ రోజు దీపం వెలిగించకపోయినా ఈరోజున 30 ఒత్తులు వెలిగించి నీటిలో వదిలితే మాసమంతా దీపారాధన చేసిన పుణ్యం దక్కుతుందని మహిళల నమ్మకం.

జిల్లా అక్రమ వ్యాపారాల మాఫియా సామ్రాజ్యంగా మారింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ఒక్కొక్కరు ఆయా వ్యాపారాలకు డాన్లుగా అవతరించారు. అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం చేష్టలూడిగి చూస్తోంది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని పేదల కడుపుకొట్టి రేషన్ బియ్యాన్ని గద్దల్లా తన్నుకు పోతున్నారు. దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం డోర్ డెలివరీ చేస్తున్నారు. గంజాయిని ఊరూరుకు చేరవేస్తున్నారు. ఇక రాత్రయితే చాలు సరిహద్దు దాటేస్తున్న గ్రానైట్.. ఇదంతా అధికార కూటమి నేతల కనుసన్నలలో జరుగుతున్న అక్రమ దందాలు. జిల్లాల్లో ఎక్కడో ఒక చోట మద్యం.. బియ్యం.. గంజాయి.. అక్రమంగా తరలుతున్న గ్రానైట్.. ఇసుక లారీలు పట్టుబడుతుండడం ఇందుకు నిరద్శనంగా నిలుస్తున్నాయి.

# కూటమి పంథా.. మాఫియా దందా!



- పేదల బియ్యం బొక్కేస్తున్నారు
- ఊరూరా బెల్టు దుకాణాలు
- పల్లెల్లో మద్యం పరవళ్లు
- జోరుగా గంజాయి వ్యాపారం
- గ్రానైట్ జీరో దందా
- అధికార టీడీపీ నేతల కనుసన్నల్లో అక్రమాల జోరు
- చోద్యం చూస్తున్న అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

ఐదు నెలల్లోనే జిల్లాలో పరిస్థితులు మారిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడమే తరువాయి అక్రమ వ్యాపారాలు జోరందుకున్నాయి. జిల్లాలో ఎక్కడ చూసినా పచ్చ తమ్ముళ్ల దొంగ వ్యాపారాల గురించే ప్రజలు చర్చించుకుంటున్నారు. మద్యం డోర్ డెలివరీతో ప్రశాంతతకు మారుపేరైన పల్లెసీమల్లో అశాంతి నెలకొంటోంది. జిల్లాలో జరుగుతున్న అన్నీ రకాల అక్రమ వ్యాపారాలకు అధికార కూటమి పార్టీల నేతల అండదండలు ఉండడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అరెస్టు చేస్తే చాలు ప్రజా ప్రతినిధుల నుంచి ఫోన్ల మీద ఫోన్లు వస్తుండడంతో అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. దాంతో అక్రమ వ్యాపారులు అధికారులను లెక్కచేయడం లేదు. కొన్ని చోట్ల బెదిరింపులకు దిగుతున్నారు. జిల్లాలో తెలుగు తమ్ముళ్లు ఆడిందే ఆట పాడిందే పాట అనే పరిస్థితి నెలకొంది.

### రేషన్ బియ్యం..పక్కదారి

జిల్లాలో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలుత రేషన్ షాపులను స్వాధీనం చేసుకునేందుకు నేతలు పావులు కదిపారు. అప్పటి వరకు పని చేస్తున్న రేషన్ డీలర్ల చేత రాజీనామాలు చేయించారు. మొండికేసిన డీలర్లపైకి అధికారులను ఉసిగొల్పి కేసులు బనాయించారు. వీరి ఆగడాలను భరించలేని కొందరు డీలర్లు న్యాయస్థానాలకు వెళ్లారు. ఈ క్రమంలోనే జిల్లాలోని 38 మండలాల్లో రేషన్ సిండికేట్లు ఏర్పాటయ్యాయి. ప్రస్తుతం జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున రేషన్ సిండికేట్ ఉన్నట్టు సమాచారం. తెలుగు తమ్ముళ్లతో ఏర్పాటు చేసిన ఈ సిండికేట్ల ద్వారా రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. జిల్లాలో ప్రతి నెలా 8738.69 టన్నుల బియ్యం పేదలకు పంపిణీ చేయాల్సి ఉంది. నేరుగా లబ్ధిదారుల నుంచే కిలో బియ్యం రూ.10 నుంచి రూ.15 కు కొనుగోలు చేస్తున్న సిండికేటుగాళ్లు పక్కనే ఉన్న పల్నాడు జిల్లా వినుకొండ, నంద్యాల జిల్లాలకు బియ్యాన్ని తరలించి రీ సైక్లింగ్ చేసి గోతాలు మార్చి పక్క జిల్లాలో ఉన్న పోర్టుకు తరలిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రేషన్ అక్రమ రవాణా ద్వారా సిండికేట్‌లోని ఒక్కో సభ్యుడికి నెలకు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు ముడుతుందని ప్రచారం జరుగుతోంది. దీనికి ముఖ్యంగా పశ్చిమ ప్రకాశం అడ్డాగా మారింది. యర్రగొండపాలెం నుంచి మొదలు కొని మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో రేషన్ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని అమానిగుడిపాడు నుంచి అర్ధరాత్రి తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పక్కా సమాచారంతో మార్కాపురం డిప్యూటీ కలెక్టర్ సినీ ఫక్కీలో ఛేజ్ చేసి పట్టుకోవడం సంచలనం సృష్టించింది.

### గంజాయి వ్యాపారంలోకి దొంగలు...

జిల్లాలో గంజాయి వ్యాపారం జోరుగా సాగుతోంది. గత నెలలో ట్రాన్స్‌ఫారాలు పగలగొట్టి అందులోని రాగి తీగలను అపహరించి విక్రయించే దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులకు వారి వద్ద గంజాయి లభించడం ఆశ్చర్యాన్ని కలిగించింది. వినుకొండ రైల్వే స్టేషన్లో గుర్తు తెలియని వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి కురిచేడు పరిసర ప్రాంతాల్లో విక్రయించేందుకు వెళుతుండగా పట్టుబడ్డారు. ఇది జరిగిన రోజుల వ్యవధిలోనే మోటారు బైకులను దొంగలించే అంతర్‌రాష్ట్ర ముఠాను పోలీసులు పట్టుకున్నారు. ఈ బైకు దొంగలు కూడా గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. వారి వద్ద నుంచి 4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల నగరంలోని ఒక స్పా మసాజ్ సెంటర్‌పై దాడులు చేసిన పోలీసులకు గంజాయి పాకెట్లు లభ్యమయ్యాయి. చీమకుర్తి ప్రాంతంలో వలస కూలీల లక్ష్యంగా పెద్ద మొత్తంలో గంజాయి విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. మార్కాపురం పూలసుబ్బయ్య కాలనీ, ఎస్టేట్ ప్రాంతాలతో పాటుగా ఇంజినీరింగ్ కాలేజీల వద్ద గంజాయి ముఠాలు తిష్ట వేసినట్లు సమాచారం. నగరం నడిబొడ్డున ఉన్న గోరంట్ల థియేటర్ ప్రాంతంలో రాత్రయితే చాలు గంజాయి వ్యాపారులు రోడ్డు మీదకు వచ్చేస్తున్నారు. ఇస్లాంపేట రెండో లైనులోని ఒక రిటైర్డ్ ఎస్‌ఐ ఇంటి ముందు ఉన్న ఖాళీ స్థలం గంజాయి వ్యాపారులకు అడ్డాగా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ రాత్రి 10 గంటల వరకు గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

### రాత్రుళ్లు సరిహద్దు దాటుతున్న గ్రానైట్

ఇక టన్నుల కొద్దీ గ్రానైట్ అక్రమంగా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతుంది. ప్రభుత్వాదాయానికి భారీగా గండిపడుతున్నా పాలకుల నుంచి సరైన స్పందన లేదు. ఎమ్మెల్యేలు తన అనుచరుల ద్వారా ఈ అక్రమ వ్యాపారాలు చేయిస్తుంటే చర్యలు తీసుకునేందుకు అధికారులు తటపటాయిస్తున్నారని చెప్పుకుంటున్నారు. రాత్రయితే చాలు ఒంగోలు, కొండపి మీదుగా నెల్లూరు, చెన్నై వైపు.. మార్కాపురం, గిద్దలూరు, అటు సంతనూతలపాడు, దర్శి, అద్దంకి మీదుగా హైదరాబాదుకు తరలిపోతోంది. ఈ దందాలో ఆయా నియోజకర్గాల్లో అధికార తెలుగు దేశం ఎమ్మెల్యే కనుసన్నల్లో జరుగుతోందని, కోట్లు జేబుల్లోకి వెళుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. మొత్తం మీద కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అవినీతి, అక్రమాలు పెచ్చుమీరి పోయాయి. ఎవరైనా ఈ అవినీతిని ప్రశ్నిస్తే సోషల్ మీడియా పేరుతో కేసులు బనాయించి నోళ్లు మూయిస్తున్నారు.

### ఊరికో బెల్టుషాపు..ఇంటింటికీ మద్యం...

కాపురాలను కూల్చే మద్యం తెలుగు తమ్ముళ్లకు ఆదాయ వనరుగా మార్చింది కూటమి ప్రభుత్వం. గత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించేలా చేశారు. తద్వారా మద్యాన్ని కట్టడి చేసేందుకు ప్రయత్నించారు. క్రమంగా మద్య నిషేధం విధించాలని ఆలోచన కూడా చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రైవేటు మద్యం దుకాణాలకు తలుపులు బార్లా తెరించింది. మద్యం వ్యాపారాన్ని ప్రతి గ్రామానికి విస్తరించేలా చర్యలు తీసుకుంది. జిల్లాలో 171 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. ఏకంగా కలెక్టర్ చేతుల మీదుగా లాటరీ తీయించి లైసెన్సులను మంజూరు చేయించడం విమర్శల పాలైంది. సీన్ కట్ చేస్తే ఇప్పుడు జిల్లాలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలకు అనుబంధంగా ఒక్కొక్కరు కనీసం 20 నుంచి 30 వరకు బెల్టు షాపులను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2,500కు పైగానే బెల్టుషాపులు ఉన్నట్లు సమాచారం. కౌసల్యా సుప్రజా రామా అంటూ సుప్రభాతంతో తెలవారే పల్లెటూర్లలో ఇప్పుడు తెలవారు జామున 4 గంటల నుంచి రాత్రి నిద్రపోయేంత వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మాయదారి మందు మా కాపురాలు కొల్లగొడుతోందని మహిళలు వాపోతున్నారు. ఒంగోలు మండలంలోని ఒక్క కరవదిలోనే 10 కి పైగా బెల్టుషాపులు ఉన్నాయంటే జిల్లాలో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. బెల్టుషాపులకు మద్యం సరఫరా చేస్తే రూ.5 లక్షలు జరిమానా విధిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే మాటలను ప్రజలు విశ్వసించడంలేదు. తెలుగు దేశం పార్టీ ఎమ్మెల్యేలే బెల్టుషాపులను పెట్టించి మద్యం వ్యాపారాల్లో వాటాలు తీసుకుంటున్నారని, ఎమ్మెల్యేలను కట్టడి చేస్తే చాలని మహిళా సంఘాలు చెబుతున్నాయి. మరో వైపు జిల్లాలో నాటుసారా తయారీ ఊపందుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి సమీపంలోని ఒక కాలనీలో నాటుసారా కాసేందుకు సిద్ధం చేసిన బెల్లం ఊటను అధికారులు ధ్వంసం చేయడం తెలిసిందే.

## అర్జీదారులకు శాశ్వత పరిష్కారం చూపాలి



గ్రీవెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

- గ్రీవెన్స్ అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలి
- గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు అర్జీదారులకు వారు తెలిపిన సమస్యలపై శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ హాలులో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణతో కలిసి మీకోసం గ్రీవెన్స్ నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. తీసుకున్న అర్జీలను సంబంధిత శాఖల అధికారులకు పంపి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన ప్రతి అర్జీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి చిత్తశుద్ధితో పరిష్కరించాలన్నారు. ఏ సమస్య పరిష్కరించినా అది పునరావృతం కాకుండా చూడాలన్నారు. పరిష్కరించలేని సమస్యలు ఉంటే అర్జీదారులను పిలిచి వారికి అర్థమయ్యేలా వివరించాలన్నారు. దీనిలో జిల్లా రెవెన్యూ అధికారి ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, లోకేశ్వరరావు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.


- మద్దిపాడు మండలం గుండ్లాపల్లి గ్రామానికి చెందిన ప్రజలు గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తమ గ్రామంలో రోడ్లను ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఆ నిర్మాణాలకు కార్యదర్శి సహకరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీబొమ్మ నుంచి కారుముడివారిపాలెం వెళ్లే ప్రధాన రహదారిని ఆక్రమించి అక్రమ భవన నిర్మాణాలు చేస్తున్నారని పరిశీలించి నిర్మాణాలు నిలుపుదల చేయడం, తొలగించడంతో పాటు సెక్రటరీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ అందజేశారు.
- ఒంగోలుకు చెందిన పల్లపోలు నవ్య గ్రీవెన్స్‌లో అధికారులను కలిసి తాను పుట్టినప్పటి నుంచి నడవలేనని, తనకు వికలాంగుల పింఛన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ అందజేసింది.
- కొత్తపట్నం మండలం సంకువానికుంట గ్రామ సర్పంచ్ కసుకుర్తి సుబ్బరత్నం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌ను కలిసి తమ గ్రామంలో జలజీవన్‌మిషన్ కింద పైప్‌లైన్ నిర్మాణం చేపట్టారని, అయితే పైప్‌లైన్ వేసి మిగిలిన పనులు కొన్ని అసంపూర్తిగా వదిలేశారని ఫిర్యాదు చేశారు. దీంతో పైపు లైన్ వేసినా కూడా నిరుపయోగంగా ఉందని పరిశీలించి మిగిలిన పనులు పూర్తి చేయించాలని కోరుతూ అర్జీ అందజేశారు.



వారి ఆత్మస్థైర్యం ముందు వైకల్యం చిన్నబోయింది. వారి సంకల్పం ముందు విధి సైతం ఓడిపోయింది. మేం ఎందులోనూ తీసిపోమంటూ దివ్యాంగులు ఆటల పోటీల్లో దూసుకుపోయారు. చెస్, ట్రై సైకిల్, రన్నింగ్, త్రోబాల్ ఇలా ఆటల పోటీల్లో సత్తా చాటి ఔరా అనిపించారు. - 8లో

## పోలీసు బ్యాండ్‌లో ఢంకా మోగించిన నరసింహులు

ఒంగోలు టౌన్: ఆల్ ఇండియా పోలీసు బ్యాండ్ పోటీల్లో ఏఆర్ పోలీసు కానిస్టేబుల్ సత్తా చాటారు. నవంబర్ 16 నుంచి 22వ తేదీ వరకు నాగాలాండ్‌లోని దిమాపూర్‌లో 25వ జాతీయ పోలీసు బ్యాండ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఒంగోలు ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఈవీ నరసింహులు ఆంధ్ర ప్రదేశ్ బృందం తరపున బగల్స్ విభాగంలో పోటీలో పాల్గొన్నారు. అద్భుతమైన ప్రతిభతో బ్రాంజ్ మెడల్ సాధించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో బ్యాండ్‌కు ఎనలేని ప్రాధాన్యత ఉందని చెప్పారు. పోలీసులకు, సమాజానికి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంలో బ్యాండ్ విశేషమైన పాత్ర పోషిస్తుందన్నారు. పోలీసు దళాలకు సంకేతాలు ఇవ్వడం ద్వారా సమన్వయం చేయడానికి, మార్చ్ సమయంలో లయతో ఉత్సాహం నింపడానికి డ్రమ్స్, బగుల్స్, ట్రంపెట్స్ వంటివి ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పోలీసు శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు నిరంతర సంగీత సాధనతో జాతీయ స్థాయి పతకాలను సాధించడం గొప్ప విషయమని కొనియాడారు. భవిష్యత్తులో సంగీతంలో మరింత నైపుణ్యాన్ని సాధించడం ద్వారా మరిన్ని పతకాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, ఆర్ఐలు సీతారామిరెడ్డి, రమణా రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.



ఏఆర్ కానిస్టేబుల్ నరసింహులును అభినందిస్తున్న ఎస్పీ దామోదర్

క్లుప్తంగా

## కలెక్టర్‌తో డీఐపీఆర్‌ఓ భేటీ



కలెక్టర్ తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఐపీఆర్‌ఓ వేణుగోపాల్

**ఒంగోలు అర్బన్:** జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి(డీఐపీఆర్‌ఓ)గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పి.వేణుగోపాల్ సోమవారం ప్రకాశం భవనంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఇప్పటి వరకు డీఐపీఆర్‌ఓగా పనిచేసిన గ్రేస్ లినోరా ఉద్యోగ విరమణ చేయగా ఆ స్థానంలో వేణుగోపాల్ బాధ్యతలు చేపట్టారు.

## అధికారులపై పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు కాపీ

**ముండ్లమూరు (దర్శి):** పొదిలి ఫుడ్‌ఇన్‌స్పెక్టర్ ప్రమోద్, ముండ్లమూరు ఆర్‌ఐ, వీఆర్వోపై మండలంలోని కమ్మవారిపాలెం రేషన్ డీలర్ జీవీ రమణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆర్‌ఐ, వీఆర్వోలు రేషన్ షాపులో తనిఖీ చేసి ఎటువంటి వ్యత్యాసం లేదని వెళ్లిపోయారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన భర్తకు అనారోగ్యంగా ఉండటంతో సాయంత్రం తనను తీసుకుని దర్శి వైద్యశాలలో చికిత్స కోసం వెళ్లినట్లు రమణ తెలిపారు. ''నేను ఎఫ్ఐ ప్రమోద్‌ను, ఆర్‌ఐ, వీఆర్వోతో కలిసివచ్చా. షాపు తనిఖీ చేయాలి. తాళాలు తీసుకురండి' అని రాత్రి 7 గంటలకు ఫోన్ చేశారని, 'తాము ఆస్పత్రిలో ఉన్నాం, పది నిమిషాల్లో వస్తాం' అని చెప్పినా వినకుండా మా దుకాణం తాళం పగలగొట్టి ఈపాస్ మిషన్, కందిపప్పు, చక్కెర విక్రయించగా వచ్చిన రూ.6900 నగదు తీసుకుని వెళ్లిపోయారని వివరించారు.



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



పరుగు పందెంలో బాలికలు



వీల్ చైర్ రేస్‌లో దూసుకెళ్తున్న చిన్నారి



ఆనందమే హద్దుగా పరుగు తీస్తున్న బాలికలు

# ఓడిన వైకల్యం.. ఆత్మస్థైర్యానిదే విజయం!

- ఉత్సాహంగా, ఉల్లాసంగా విభిన్న ప్రతిభావంతుల క్రీడా పోటీలు
- పోటీలను ప్రారంభించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

**ఒంగోలు వన్‌టౌన్:** వైకల్యం వారి ఉత్సాహాన్ని ఏ మాత్రం కుంగదీయలేదు. వారి ఆత్మస్థైర్యం ముందు వైకల్యం తల వంచి సలాం కొట్టింది! అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఒంగోలు డీఆర్‌ఆర్‌ఎం స్కూల్ వేదికగా ఉమ్మడి ప్రకాశం జిల్లా దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. క్రీడా పోటీలను కలెక్టర్ తమీమ్ అన్సారియా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహించేందుకు 10 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది దివ్యాంగ విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. షాట్‌పుట్, పరుగు పందెం, త్రిచక్ర వాహన పోటీలు, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రో, క్రికెట్, వాలీబాల్ తదితర విభాగాల్లో దివ్యాంగులు పాల్గొని ప్రతిభ చాటారు. దివ్యాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అర్చన, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ లక్ష్మానాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, బీసీ సంక్షేమ శాఖాధికారి అంజల, జిల్లా సైనిక సంక్షేమ శాఖ అధికారి రజనీ కుమారి, గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆదిలక్ష్మి, ప్రభుత్వ బదిరుల ఆశ్రమ పాఠశాల, ఉమా మనోవికాస కేంద్రం, ఎస్‌ఆర్‌కే చెవిటి మూగ పిల్లల పాఠశాల తదితర స్కూళ్లకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.



విరబూసిన ఆనందం : వీల్ చైర్ రేస్‌లో ఓ యువతి సంతోషం





సంతోషమే సగం బలం : షాట్‌పుట్ విసురుతున్న బాలికలు



ఎత్తులన్నీ చిత్తు : చెస్ ఆడుతున్న దివ్యాంగులు

## అవగాహనతోనే ఎయిడ్స్ మహమ్మారికి చెక్



ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులు

**ఒంగోలు టౌన్:** ఎయిడ్స్ వ్యాధి, హెచ్‌ఐవీపై సమగ్ర అవగాహన పెంపొందించుకోవడం ద్వారా మహమ్మారికి చెక్ పెట్టడం సులువవుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు పేర్కొన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్, నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్ఎస్ఎస్) సంయుక్త ఆధ్వర్యంలో వైద్య కళాశాలలో సోమవారం ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎయిడ్స్ వ్యాధిపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం వైద్య కళాశాల నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ సూపరెండెంట్ డాక్టర్ జమున, కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.తిరుమల రావు, వైద్యులు సురేష్, సాగర్, భాస్కర్, రాధిక, వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు.



# మద్యం మత్తులో జనసేన మూక విధ్వంసం

- ఒంగోలులోని బిలాల్ హోటల్లో ఫర్నిచర్ ధ్వంసం
- అడ్డు వచ్చిన సిబ్బందిపైనా విచక్షణా రహితంగా దాడి
- కస్టమర్లను సైతం తరిమికొట్టిన వైనం

**ఒంగోలు టౌన్:** మద్యం మత్తులో ఉన్న జనసేన కార్యకర్తలు ఒంగోలు నగరంలోని బిలాల్ హోటల్లో విధ్వంసం సృష్టించారు. అడ్డొచ్చిన సిబ్బందిని చితకబాదారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని మినీ స్టేడియం ఎదురుగా ఉన్న బిలాల్ స్టేడియానికి సోమవారం సాయంత్రం జనసేన పార్టీకి చెందిన దండే సత్యం, మరో ముగ్గురు వచ్చారు. వారంతా అప్పటికే పూటుగా మద్యం తాగి ఉన్నారు. ఆర్డర్ ఇచ్చిన కాసేపటి తర్వాత పక్క టేబుల్‌పై ఉన్న వ్యక్తులతో వాగ్వివాదానికి దిగారు. ఈ క్రమంలోనే ఆర్డర్ ఆలస్యమైందంటూ హోటల్ సిబ్బందిపైనా చేయి చేసుకున్నారు. హోటర్ వెయిటర్లు రవి, లక్కీని విచక్షణారహితంగా కొట్టారు. ఈ దాడిలో లక్కీ అనే యువకుడి దవడ పగిలిపోయింది. గొడవ జరుగుతున్న సమయంలోనే ఫోన్ చేసి బయట నుంచి మరికొందరు యువకులను పిలిపించారు. వారు వచ్చీరాగానే పెద్ద పెట్టున కేకలు వేస్తూ ఫర్నిచర్‌తో సహా చేతికి దొరికిన వస్తువులన్నింటినీ పగలగొట్టారు. హోటల్లో తినేందుకు వచ్చిన కస్టమర్లను సైతం తరుముకున్నారు. సుమారు గంటపాటు ఈ విధ్వంసకాండ కొనసాగింది. బాధితుల అరుపులు, సత్యం ముఠా కేకలతో బిలాల్ హోటల్ రణరంగంగా మారింది. మినీ స్టేడియం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. హోటల్ యజమాని షేక్ లియాఖత్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా సీఐ అజయ్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# సాయుధ దళాల నిధికి విరాళాలివ్వాలి



సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు

- ప్రజలకు కలెక్టర్ తమీమ్ అన్సారియా విజ్ఞప్తి
- సాయుధ దళాల పతాక దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

**ఒంగోలు అర్బన్:** సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ప్రజలు, వ్యాపారులు విరివిగా విరాళాలు అందజేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా కోరారు. ఈ నెల 7వ తేదీన నిర్వహించనున్న సాయుధ దళాల పతాక దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం ప్రకాశం భవన్‌లోని గ్రీవెన్స్ హాల్లో కలెక్టర్ ఆవిష్కరించారు. అలాగే స్టిక్కర్లు, కారు ఫ్లాగ్‌ను జిల్లా అధికారులతో కలిసి విడుదల చేశారు. స్టిక్కర్లను జిల్లాలోని వివిధ కార్యాలయాలకు పంపి వాటి విక్రయం ద్వారా వచ్చిన డబ్బును యుద్ధంలో మరణించిన, గాయపడిన వారి కటుంబాల సంక్షేమానికి వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, డీఆర్‌ఓ ఓబులేసు, సైనిక సంక్షేమాధికారి రజనీకుమారి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఘర్షణ కేసులో ఇద్దరు అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు యువకులు

**ఒంగోలు టౌన్:** మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని ఓ యువకుడితో ఘర్షణ పడుతున్న నలుగురిని వారించిన వ్యక్తులపై ఇనుపరాడ్లు, రాళ్లతో దాడి చేసిన ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. అక్టోబరు 29వ తేదీన ఒంగోలుకు చెందిన మలగ రాఘవేంద్రరావు, అతడి తమ్ముడు ఆంజనేయులు కలిసి స్నేహితుడైన అశోక్‌తో పేర్నమిట్ట పాలకేంద్రం ఎదురుగా సరదాగా మాట్లాడుకుంటున్నారు. అంతలో పేర్నమిట్ట గ్రామానికి చెందిన శిఖా నితిన్, బుట్టి ఎలీషా, తేళ్ల తిమోతి, భీమవరపు సురేష్ అటుగా వచ్చారు. మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని అశోక్‌ను కోరగా అతడు తన వద్ద లేవని చెప్పడంతో గొడవ పెట్టుకున్నారు. పక్కనే ఉన్న రాఘవేంద్రరావు, అంజనేయులు గొడవ వద్దని చెబుతుండగా ఆగ్రహానికి గురైన నిందితులు నలుగురు ఇనుప రాడ్లు, రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేసి తల పగలగొట్టారు. ఈ ఘటనలో నలుగురు నిందితులపై కేసులు నమోదయ్యాయి.శిఖా నితిన్, తేళ్ల తిమోతిని సోమవారం అరెస్టు చేశారు. మిగిలిన ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ అజయ్ కుమార్ తెలిపారు. నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని సీఐ హెచ్చరించారు.

## కొండపిలో ట్రాక్టర్ చోరీ

**కొండపి:** ట్రాక్టర్ చోరీ సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు కొండపి ఎస్సై ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కొండపికి చెందిన గుమ్మల్ల రాంబాబు అనే వ్యక్తి తన రెండు ట్రాక్టర్లను పాత సచివాలయం పక్కన ఉన్న ఖాళీ ప్రదేశంలో నిలిపాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో ఒక ట్రాక్టర్‌ను దొంగలు అపహరించారు. సోమవారం ఉదయం ట్రాక్టర్ కనిపించకపోవడంతో బాధితుడు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికాడు. ట్రాక్టర్ జాడ లేకపోవడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### కులాంతర వివాహం చేసుకుందని దాడి

**చీమకుర్తి:** కులాంతర వివాహం చేసుకున్న యువ జంటపై యువతి తరపు బంధువులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎం.సుబ్బారావు తెలిపారు. వివరాలు.. పొదిలి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శ్రీవల్లి, సుబ్రహ్మణ్యం 9 నెలల క్రితం కులాంతర వివాహం చేసుకొని హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. ఇటీవల చీమకుర్తికి మకాం మార్చారు. ఈ విషయం శ్రీవల్లి బంధువులకు తెలియడంతో ఇద్దరిపై దాడి చేశారు. ఈ నేపథ్యంలో తమకు రక్షణ కల్పించాలంటూ శ్రీవల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై శ్రీనివాసరెడ్డి కేసు నమోదు చేశారు.

# శ్రీశైలం ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, టెంపో



ఘటనా స్థలంలో ప్రమాదానికి గురైన వాహనాలు

**పెద్దదోర్నాల:** ఎదురుగా వస్తున్న ఆర్టీసీ, టెంపో ట్రావెల్స్ బస్సులు ఒకదానికొకటి ఢీకొన్న సంఘటన శ్రీశైలం ఘాట్ రోడ్డులోని చింతల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. దీంతో రెండు వాహనాలు రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవటంతో ట్రాఫిక్‌కు అరగంట పాటు అంతరాయం ఏర్పడింది. ప్రమాద సమాచారం అందుకున్న హైవే మొబైల్ టీమ్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఎస్సై మహేష్ కథనం మేరకు.. శ్రీశైలంలో దైవ దర్శనం ముగించుకుని దోర్నాల వైపు వస్తున్న మినీ టెంపో ట్రావెల్స్ బస్సు, శ్రీశైలం వైపు వెళ్తున్న నరసరావుపేట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు ఒకదానికొకటి ఢీకొన్నాయి. రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను హైవే మొబైల్ టీం తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## వీధి కుక్కల దాడిలో 15 గొర్రె పిల్లలు మృతి

**సంతనూతలపాడు:** గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేయడంతో 15 గొర్రె పిల్లలు మృతి చెందాయి. ఈ సంఘటన సంతనూతలపాడు మండలంలోని చిలకపాడు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పాలపర్తి రాంబాబు వేములపాడు వెళ్లే రహదారిలో ఉన్న తన దొడ్డిలో 17 గొర్రె పిల్లలను ఉంచాడు. వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో మందలోని 15 గొర్రె పిల్లలు మృతి చెందగా మరో రెండు కొన ఊపిరితో ఉన్నాయి. సుమారు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయాడు.



వీధి కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రె పిల్లలు

## పోలీస్ గ్రీవెన్స్‌కు 65 ఫిర్యాదులు

**ఒంగోలు టౌన్:** జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 65 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు పోలీసు ఉన్నతాధికారులను కలిసి సమస్యలు చెప్పుకొన్నారు. ఫిర్యాదులకు సంబంధించి ఆయా పోలీసు స్టేషన్ల అధికారులతో మాట్లాడిన ఉన్నతాధికారులు.. సాధ్యమైనంత త్వరగా బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ఎక్కువగా భూ వివాదాలు, ఉద్యోగ మోసాలు, కుటుంబ వ్యవహారాలపై ఫిర్యాదులు వచ్చినట్లు డీపీఓ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ దేవ ప్రభాకర్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సైలు షేక్ రజియా సుల్తానా, ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.

## బంగారం దుకాణంలో నగలు చోరీ

**తాళ్లూరు:** మండలంలోని తూర్పుగంగవరం గ్రామంలో బంగారు దుకాణంలో నగలు చోరీ అయిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. గుర్తు తెలియని ఇద్దరు మహిళలు విఘ్నేశ్వర జ్యూవెలర్స్ దుకాణానికి వచ్చారు. ఆరు జతల కమ్మలు చోరీ చేసి వారి వద్ద ఉన్న నకిలీ కమ్మలు అక్కడ పెట్టారు. ఆలస్యంగా గుర్తించిన దుకాణ యజమాని బత్తుల వెంకట సుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలాన్ని దర్శి సీఐ వై.రామారావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మోహన్‌రావు తెలిపారు.

## మనవళ్లు గెంటేశారు

- సబ్ కలెక్టరేట్‌లో ఓ అవ్వ ఆక్రందన



**మార్కాపురం:** 'వృద్ధురాలినని కూడా చూడకుండా నా ఇంటిని నా మనవళ్లు ఆక్రమించుకుని బయటకు వెళ్లగొట్టారు. చలికి వీధుల్లో ఉండలేకపోతున్నా. నాకు న్యాయం చేయండయ్యా..' అంటూ పుల్లలచెరువు గ్రామానికి చెందిన 78 ఏళ్ల నక్కా బుర్రమ్మ సోమవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గోడు వెళ్లబోసుకున్నారు. తన భర్త బంగారయ్య కొంతకాలం క్రితం మృతి చెందారని, ఆస్తిని నలుగురు కుమారులు పంచుకున్నారని వివరించారు. తాను ఉండేందుకు ఒక ఇల్లు ఇవ్వగా.. ఒక కుమారుని కొడుకులు ఆక్రమించుకుని బయటకు వెళ్లగొట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. తన మనుమళ్ల ఆధీనంలో ఉన్న తన ఇంటిని తనకు ఇప్పించి న్యాయం చేయాలని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించింది.